సరదాగా
చెప్పుకున్న
దయ్యం కథ
వాళ్లలో
రేకెత్తించిన భయం!

# పెళ్లిచేసుకోవా!

డా. విప్పర్తి ప్రణవమూర్తి కథ

''కావలసిన పార్టులన్నిటినీ మార్చి ఇస్తున్నామండి ఫైనల్ సర్వీసుగదా! జాగ్రత్తగా ట్యూన్ చేసి ఇస్తున్నాము'' అన్నాడు మెకానిక్.

మధ్యాహ్నం ఇస్తారనుకున్న కారుని సాయంకాలం ఆరు గంటలకి ఇచ్చారు. శీతాకాలం కాబట్టి అప్పటికే బాగా చీకటి పడిపోయింది.

''రాత్రి ప్రయాణం చల్లగా సుఖంగా వుంటుంది. పోదాం పదండి'' అన్నాడు ప్రసాదు.

ఆల్ఫాలో పలావు పేకెట్లు తీసుకుని, ఫుల్ టాంకు పెట్రోలు కొట్టించి మలక్‌పేట అవుట్‌స్కర్ట్సు చేరేసరికి ఏడున్నర అయింది. రాజు డ్రైవ్ చేస్తున్నాడు.

చీకటి నిర్మానుష్యం. కారు సాఫీగా పరుగెడుతోంది. అప్పుడప్పుడు ఎదురవుతున్న మేకల, గేదెల మందలు, వాటి కళ్లు మెర్క్యురీ దీపాలలా వెలిగిపోతున్నాయి.

''అవిగో అవే కొరివిదెయ్యాలు'' దూరంగా పొలాల్లో మంటల్ని చూపించాడు ప్రసాదు.

''కొరివి దెయ్యాలుకాదు, గాడిదగుడ్డూ కాదు. పొలంలో చలిమంటల్ని వేసుకుంటున్నారు. అంతే'' అని కొట్టిపారేశాడు రాజు. రాజు అసలే పిరికివాడు.

''నేనో దెయ్యం కథ చెపుతానువింటారా'' ఉడికించాడు ప్రసాదు.

కారు లైటులో కార్నర్‌లోని సిమెంట్ విగ్రహాలు అదోలా కనిపించాయి.

''దెయ్యాల కథలు ఇప్పుడెందుకులెండి'' అన్నాడు రాజు.

''థ్రిల్లింగ్‌గా వుంటుంది చెప్పనీయ్'' అన్నాను నేను.

కథను మొదలుపెట్టాడు ప్రసాదు.

ఆ వూళ్లో కోర్టు ఆవరణ చాలా పెద్దది. పదెకరాల స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్, మధ్య ఎప్పుడో బ్రిటిష్ కాలంలో కట్టిన రాతి కట్టడం కోర్టు



హాల్. ఎదురుగా రెండు షెడ్లు. ఒక దానిలో ప్లీడరు గుమాస్తాలు కోర్టు మనుషులు, మరొకదానిలో ప్లీడర్లు రిలాక్సు అవుతారు. సాయంకాలం ఐదు గంటలకి కోర్టు మూసేస్తారు. ఆరు దాటితే ఇక అక్కడ జన సంచారమే వుండదు. ఆదివారాల్లో, శలవురోజుల్లో పగలే అక్కడ మనుషులుండరు.

మిట్టమధ్యాహ్నం కూడా చెట్ల నీడలో ఎండ కనబడదు. ఎయిర్ కండిషన్ వున్నట్లు చల్లగా

వుంటుంది. చీకటి జీబురుగా వుంటుంది. ఉడతలు, కోతులు ఎన్నెన్నో విన్యాసాలు చేస్తూ చెట్లమీద దూకుతూ వుంటాయి. దూరంగా నక్కల కూతలూ వినిపిస్తుంటాయి. దెయ్యాల్లా తలలూపే చింతచెట్ల మధ్య ఎంత ధైర్యవంతుడికైనా గుండెల్లో గుబులుగా వుంటుంది. ఆ చెట్ల మధ్య ఒక అల్లనేరేడు చెట్టుకూడా వున్నది. కాలంలో నేరేడుపళ్లు చెట్టు చుట్టూ రాలి పడివుంటాయి.

భయంలేని కొంతమంది ఆకతాయి కుర్రాళ్లు ఐదారుగురు జట్టుగా పోయి చింతకాయల్ని, నేరేడు పళ్లను ఏరుకొచ్చేవారు.

ప్రసాదుకప్పుడు పదిహేను సంవత్సరాలు. నూనూగు మీసాలు అప్పుడప్పుడే మూతిమీద కనీ కనిపించకుండా మొలుస్తున్నాయి. సెక్సు గురించి తెలిసీ తెలియని వ్యాఖ్యానాలు చేసుకుంటున్న వయసు.

ఆడపిల్లల్ని అల్లరిపెట్టి ఏడిపించే వయసు.

దాంపత్యసుఖం, కొక్కోకం, స్త్రీ గురించిన కుతూహల విషయాలు లాంటి పుస్తకాలను డిటెక్టివ్ పుస్తకాలతో బాటు దొంగతనంగా చదువుతూ, బ్రహ్మచారీ భోగన్యాయంగా సూలించిపోయే వయసు.

ఆరోజు ఆదివారం మధ్యాహ్నం ప్రసాదు అతని స్నేహితులు భాషా, ఖాన్, ఆదినారాయణ, కృష్ణకోర్టు ఆవరణలోకి వెళ్లారు. నేరేడిపళ్లు, చింతకాయలు దొరికినన్నిటిని జేబుల్లో కుక్కుకున్నారు. గంతులేస్తూ కోతికొమ్మచ్చిలాడారు.

హఠాత్తుగా ''ఒరేయ్ ప్రసాదు ఆ చింత చెట్టు దగ్గరకు వెళ్లకు దానిమీద దెయ్యాలున్నాయట'' అరిచాడు ఖాన్.

ఒళ్లు జలదరించిన ప్రసాదు పరుగెట్టుకొచ్చేశాడు.

''ఆ చెట్టుదగ్గరకెళితే పైనుండి రాళ్లు పడతాయట. ధైర్యంచేసి ఆ రహస్యం తెలుసుకుందామని ఆ చెట్టునెక్కిన ప్రతివాడు, మరుసటిరోజుకి ఆ చెట్టు మొదట్లోనే శవమై వండేవాడట. ఇలాగ పదివంది పైగానే చచ్చిపోయారట. మా అన్న చెప్పాడు'' మిగిలిన విషయం చెప్పాడు ఖాన్.

ఇంతలో వాచ్‌మాన్ వీళ్లను తరుముకుంటూ వచ్చాడు.

ఖాన్, భాషా, ఆదినారాయణ, కృష్ణలు పరుగెట్టుకు పోగలిగారు. దగ్గరలోనే వున్న ప్రసాదు మాత్రం చెట్టు మొదలులో దాక్కుని వుండిపోవలసి వచ్చింది.

అటూ ఇటూ చూసి కొంతసేపటికి వాచ్‌మెన్‌కూడా వెళ్లిపోయాడు. అప్పటికే సాయంత్రం ఐదున్నర ఆరు అవుతుంది. చీకటి బాగా అలుముకుంది. ప్రసాదుకు ముచ్చెమటలు పట్టాయి. దెయ్యం చెట్టువైపు చూశాడు. అది తలలూపుతూ వికృతంగా గాలికి కదులుతుంది. చెట్టుమీద తెల్లటి గుడ్డలేమో దెయ్యాల్లా కదులుతున్నాయి. ప్రసాదు కాళ్లు నిస్సత్తువతో కదలలేదు. ఎంత పరుగెడదామనుకున్నా కాళ్లు రావడంలేదు. భయంతో కళ్లు మూసుకున్నాడు.

''ప్రసాద్, నన్ను పెళ్లిచేసుకోవా? ప్రసాద్, నన్ను పెళ్లిచేసుకోవా?'' పదేపదే అవే మాటలు దగ్గరవుతున్నాయి.

వేళ్లు ఎడమచేసి సందుల్లోనుండి చూశాడు ప్రసాదు.

తెల్లటి ఆకారం దగ్గరవుతోంది. పదహారేళ్ల అమ్మాయి. తెల్లగా, సన్నగా తెల్లచీర విరబోసుకున్న జుట్టుతో చేతులు చాపుకుంటూ దగ్గరకొచ్చేస్తోంది

మరి అప్పుడు ఏమి బలమొచ్చిందో! ఇక పరుగు లంకించాడు ప్రసాదు. ఇంటకి చేరి మంచంమీద పడ్డాడు. వణుకుతూ, వళ్లంతా చెమట్లతో, అలా నిద్దురపోయాడు.

''ఆ అమ్మాయి నెమ్మదిగా చేతులు చాపుకుంటూ ''ప్రసాద్ నన్ను పెళ్లిచేసుకోవా?'' అంటూ వచ్చేస్తోంది. బలమంతా ఉపయోగించి ప్రసాద్ పరుగెడుతూనే వున్నాడు. చేతులు చాపుకుంటూ సునాయాసంగా ఆ అమ్మాయి వెన్నాడుతూనే వుంది. ప్రసాదు పరిగెడుతూనే వున్నాడు''

రాత్రి మూడో జామయింది. రెండు మైళ్ల దూరంలో వున్న ప్రసాదు పినతల్లి, పెరట్లో ఆవులరుస్తున్నాయేమని లాంతరు తెచ్చి చూసింది. చావిడిలో పాత రంగూన్ టేకు పెట్టెమీద ఎవరో కదుల్తున్నారు. పాలేరేమో అనుకుంటూ 'ఎవరూ?' అంటూ దగ్గరకొచ్చి చూసింది. మూల్గుతూ ప్రసాదు కనిపించాడు.

''నీవెప్పుడొచ్చావురా ప్రసాదు. ఇంత చీకట్లో. ఇంట్లో చెప్పావా'' అంటూ వంటిమీద చేయివేసింది పిన్ని. వాడి వళ్లు కాలిపోతోంది. వాడు కళ్లు తెరవలేదు. పరాకు మాట్లాడుతున్నాడు.

''వద్దు. నా దగ్గరకు రాకు'' అరుస్తున్నాడు.

''వీడికి నిద్దట్లో నడిచే అలవాటు'' అనుకుంటూ నెమ్మదిగా ప్రసాదును ఇంట్లో తీసుకెళ్లి పడుకోబెట్టింది.

తెల్లవారి ప్రసాదు పెద్దన్న డాక్టర్ శర్మగారిని తీసుకొచ్చాడు. ఆయన ''వీడికి మలేరియా జ్వరం'' అంటూ ఇంజక్షన్‌ను మాత్రలు ఇచ్చి నాలుగురోజులు ఇంజక్షన్లు వాడాలి. రోజూ వచ్చి ఇస్తాను'' అని, నొసటిమీద తడిగుడ్డ పెట్టించి వెళ్లాడు.

నాలుగురోజులు గడిచాయి. ప్రసాదు జ్వరం తగ్గలేదు. పలవరింతలు ఎక్కువయ్యాయి. ఈ లోకంతో సంబంధం కనబడడంలేదు.


''వంట చేసిపెడతా, నన్ను పెళ్లిచేసుకో ప్రసాదు'' ఆ అమ్మాయి ఇవేమాటలతో సతాయించేస్తుంది. ఎక్కడ కూర్చున్నా ఎదురుగా ప్రత్యక్షమౌతుంది. ఏ గదిలోకి వెళ్లినా ఆ అమ్మాయి వచ్చేస్తుంది. ప్రసాదును పరిగెట్టించేస్తుంది.

ఇంతలో సుబ్బలక్ష్మి వచ్చింది. ''అన్నయ్యా దీన్ని తరిమేయ్. దగ్గరకురానీకు'' అంది.

''ఏం చేయనే లక్ష్మి ఇది నన్ను వదలడంలేదు'' అన్నాడు.

''గూటిలో నాగవాసం మేకున్నది. దాన్ని ఆ అమ్మాయి నెత్తిమీద దిగగొట్టేయ్. అప్పుడుగాని అది

## బాలు స్టూడియో



తెలుగు చలనచిత్ర పరిశ్రమ మద్రాసునుండి ఆంధ్రప్రదేశ్‌కు తరలిరావాలని, హైదరాబాద్‌లో స్థిరపడాలని ప్రభుత్వం కృషిచేస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో స్టూడియోస్, లాబొరేటరీస్ ప్రివ్యూ థియేటర్స్, డబ్బింగ్ థియేటర్ అన్నీ ఉన్నాయి. కాని రికార్డింగ్ థియేటర్, సరైనవి లేవు అంటున్నారు కొందరు. ఆ కొరత కూడా ఎందుకని రామానాయుడు, ఎం.ఎస్.రెడ్డి రికార్డింగ్, రీ రికార్డింగ్ థియేటర్స్ నిర్మిస్తే ప్రస్తుతం గాయకులు బాలసుబ్రహ్మణ్యంకూడా తన తండ్రి పేర హైదరాబాద్‌లో రికార్డింగ్ థియేటర్ నిర్మిస్తున్నారు.

సుబ్బారావు

నిన్ను వదలదు'' సలహా ఇచ్చింది సుబ్బలక్ష్మి.

గూటిలో నాగవాసం మేకు తీశాడు. మరో చేత్తో సన్నికలు పాత్రం తీసుకున్నాడు ప్రసాదు.

అంతవరకు నవ్వుతూ కుర్చీలో కూర్చున్న ఆ అమ్మాయి ప్రసాదుమీద పడింది. ప్రసాదు చేతుల్ని గట్టిగా పట్టుకుని మేకును కొట్టనీయకుండా ప్రతిఘటిస్తుంది. అరుస్తూ విదుల్చుకుంటూ గంతులేస్తున్న ఆ అమ్మాయి జుట్టు ప్రసాదు ముఖానికి, వంటికి కొరడా దెబ్బలుగా తగులుతున్నాయి.

ఆఖరికి సుబ్బలక్ష్మి సహాయంతో ఆ అమ్మాయి నెత్తిమీద నాగవాసం మేకు దిగేశాడు ప్రసాదు.

ఆ అమ్మాయి కుప్పకూలిపోయి, బూడిదై మాయమైపోయింది.

''హమ్మయ్య ఇక భయంలేదు. అది పారిపోయింది'' అంటుంది సుబ్బలక్ష్మి.

కొద్దికొద్దిగా స్పృహ వస్తుంది ప్రసాదుకి.

ముఖంనిండా కుంకుమబొట్లు పెట్టి వేప మండతో ప్రసాదు ముఖంమీద కొడుతున్నాడు. పెద వడిశలేరు పురాతన భూతవైద్యుడు. ఇల్లంతా పూజా సామగ్రి, గాదంతో ధూపాలతో ఉక్కిరిబిక్కిరిగా వుంది.

ప్రసాదు రెండు చేతుల్ని పాలేర్లు గట్టిగా పట్టుకున్నారు.

''సుబ్బలక్ష్మి, అది చచ్చిపోయింది, పారిపోయింది'' అన్నాడు హీనస్వరంతో ప్రసాదు.

''అవును అది పారిపోయింది. ఇక భయంలేదు'' అన్నాడు భూతవైద్యుడు.

నెమ్మదిగా కళ్లు తెరిచిన ప్రసాదు పిన్నిని చూసి ''సుబ్బలక్ష్మి ఏది?'' అడిగాడు.

''ఎక్కడి సుబ్బలక్ష్మి అదిపోయి నాలుగు సంవత్సరాలు అయిందిగదా'' కన్నీళ్లు తుడుచుకుంటూ వీడికి ఇంకా పిచ్చి కుదిరిందా అంటూ అనుమానంగా చూసింది.

''ఇక పర్వాలేదు'' మంత్రాలు చదివి, తాయత్తులు కట్టాడు ప్రసాదుకు, విభూది ఇచ్చాడు భూతవైద్యుడు.

చిక్కి శల్యమైన ప్రసాదు కోలుకునేందుకు రెండు నెలలు పట్టింది.

ఇది నా స్వానుభవం అంటూ కథ ముగించాడు ప్రసాదు.

అప్పటికి తుని చేరాం.

''ఇంత చీకట్లో ప్రయాణమేమిటి, ఈ రాత్రి ఇక్కడ రెస్టు తీసుకుందాం'' ఎంత చెప్పినా రాజు వినలేదు.

ఆ రాత్రి లాడ్జిలో గడిపి, మరుసటిరోజు ప్రయాణం సాగించాం.

◆ ❖ ◆

